

ఒరిగిన జిసిసి లారీ

ప్రజాశక్తి -అనంతగిరి:జిసిసి డిపో నుంచి బియ్యం, నిత్యావసర సరుకులు రవాణా చేస్తున్న లారీ రోడ్డుపక్కకు ఒరిగిపోయింది. అనకాపల్లి జిల్లా జిల్లా దేవరాపల్లి మీదుగా జీనబాడు, పినకోట, .పెద్దకోట, కివర్ల పంచాయతీ పరిధి జీసీసీ డిపోలలో కాశీపట్నం గోదాం నుండి రేషన్ సరుకులు అధికారులు రవాణా చేస్తుంటారు. జీనబాడు, పెద్దకోట డిపోలకు బియ్యంతో పాటు సరుకులు సోమవారం రవాణా చేస్తుండగా జీలబాడు సమీపం వద్ద రోడ్డు పక్కకు లారీ ఒరిగి పోయింది. గత మూడు రోజులుగా మండలంలోని కురుస్తున్న వర్షాల కారణంగా ఈ ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.



మట్టిలో కూరుకుపోయిన లారీ

పిల్లలను బడిలో చేర్పించాలి

- పాఠశాల విద్యా కమిషనర్ సురేష్ కుమార్



మాట్లాడుతున్న పాఠశాల విద్యా కమిషనర్ సురేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని పాఠశాల విద్యా కమిషనర్ సురేష్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని మండల విద్యాశాఖాధికారులు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, కెజిబివి అధికారులు, ఐటిఐ ప్రిన్సిపాల్స్ తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వారం రోజుల్లో పూర్తి స్థాయిలో జె.వి.కె కిట్లు విద్యార్థులకు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు పాఠశాలలకు రాకుండా, విద్యార్థులు పాఠశాలకు రాకపోయినా కొన్ని చోట్ల హాజరు నమోదు చేస్తున్నారని తెలిపారు.మన బడి నాడు, మధ్యాహ్న భోజన పథకం, పాఠ్య ప్రణాళికల అమలుపై మండల విద్యాశాఖాధికారులకు అవగాహన ఉండాలని సూచించారు. విద్యాశాఖాధికారులు అంకితభావంతో పని చేయాలనాన్నారు. విద్యార్థుల హాజరుపై జిల్లా విద్యాశాఖాధికారులు సమీక్షించాలని సూచించారు. ఎం.ఇ.ఓలు, ఎటిడబ్ల్యూఓలు సమన్వయంతో పని చేసి పాఠశాలను సందర్శించి సమీక్షించాలని చెప్పారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు ఎంత మంది కళాశాలలు, ఐటిఐ చేరారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఐటిఐ పాసైన విద్యార్థులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని చెప్పారు. పాఠశాలల్లో బినామీ ఉపాధ్యాయులుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంటర్మీడియేట్ ఎడ్యుకేషన్ కమీషనర్ సౌరభ్ గౌర్ మాట్లాడుతూ, అంకితభావంతో చదువులు చెప్పాలని సూచించారు. జిల్లాలోని 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 13,227 మంది విద్యార్థులు ఇంటర్ విద్యను అభ్యశిస్తున్నారని తెలిపారు. కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను గెస్ట్ ఫ్యాకల్టీ విధానంలో భర్తీ చేస్తామని చెప్పారు. 10వ తరగతి. ఉత్తీర్ణులైన విద్యార్థులకు జూనియర్ కళాశాలలో ప్రవేశం కల్పించాలని స్పష్టం చేసారు.

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ 1.66 లక్షల మంది విద్యార్థులకు జెవికె కిట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. 21 వేల మంది విద్యార్థులను కొత్తగా పాఠశాలలో చేర్పించారన్నారు. 10 నుండి 15 వేల జె. వి.కె.కిట్లు అవసరం ఉంటుందన్నారు.అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని స్పందనలో ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో రంపచోడవరం ఐటిడిఏ పి ఓ సూరజ్ గనోరి, డిఇ ఓ సలీంభాషా, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ.కొండలరావు, రీజనల్ జాయింట్ డైరెక్టర్ జ్యోతి కుమారి, జిల్లాలోని ఎంఇఓలు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, కెజిబివి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్య సమాచారాన్ని అడిగి తెలుసుకుంటున్న సుభద్ర

బస్సు ప్రమాద బాధితుల ఆరోగ్యంపై ఆరా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పాడేరు ఘాట్‌లో వ్యూ పాయింట్ వద్ద ఆదివారం జరిగిన బస్సు ప్రమాదంలో గాయపడి విశాఖ నగరంలోని మెడికవర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వారిని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర సోమవారం పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ముంచంగిపుట్టు మండలం సరియాపుట్టు గ్రామానికి చెందిన కిల్లో బోడిరాజు, అనకాపల్లి జిల్లా నాతవరం మండలానికి చెందిన మరో క్షతగాత్ర కుటుంబం ఈ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. వారికి మెరుగైన చికిత్స అందించాలని సుభద్ర వైద్యులకు సూచించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం మెడికేర్ హాస్పిటల్‌లో చేర్చామన్నారు. వీరి ఆరోగ్య పరిస్థితిని వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. వీరందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు.

వర్షంతో బస్సు వెలికితీత పనులకు ఆటంకం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా పాడేరు ఘాట్ లోయలో పడిన బస్సును వెలికితీత పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆర్అండ్‌బి, ఆర్ టిసి, పోలీసు అధికారులు క్రేన్ సహాయంతో వెలికితీత పనులు చేపట్టారు. పనులు ప్రారంభించిన కొద్దిసేపులోనే భారీ వర్షం ఆటంకం కలిగించింది. వాతావరణం అనుకూలించక పోవడంతో వెలికితీత పనులను తాత్కాలికంగా నిలిపివేశారు.



క్రేన్ సహాయంతో సహాయ చర్యలు చేపడుతున్న అధికారులు



మాట్లాడుతున్న బాలల హక్కుల కమిషన్ సభ్యుడు సీతారాం

శిశు మరణాలను సీరియస్‌గా తీసుకుంటాం

- బాలల హక్కుల కమిషన్ సభ్యుడు సీతారాం

ప్రజాశక్తి-కొయ్యూరు

జిల్లాలో సంభవిస్తున్న శిశు మరణాలపై ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సీరియస్‌గా తీసుకోనుందని కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. కొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. అక్కడి వైద్యులు ఎం.సంపత్ బాబు, జే.మనోజ్ఞల నుండి గత మూడేళ్లుగా జరిగిన శిశు మరణాలు, ఈ ఏడాది జనవరి నుండి ఇప్పటివరకు జరిగిన మరణాలపై ఆరా తీశారు. చిన్న పిల్లలకు అందిస్తున్న వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఎంతమంది పిల్లలు వైద్యం పొందారు, వారిలో పౌష్టికాహార లోపం, తక్కువ బరువు, సికిల్ సెల్ ఎనీమియా, రక్తహీనత వల్ల వచ్చిన పిల్లలెంతమంది, దీర్ఘకాలిక వ్యాధులతో చికిత్సకొచ్చిన పిల్లల వివరాలు, మెరుగైన వైద్యం కోసం ఎంతమందిని ఇతర ఆసుపత్రులకు పంపించారు, ఎంతమంది వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, ఆరోగ్య కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు విధులు నిర్వహిస్తున్నారు తదితర అంశాలపై వివరాలు సేకరణ జరిపారు. అనంతరం డాక్టర్ సీతారాం మాట్లాడుతూ తల్లి గర్భం దాల్చిన నాటి నుండి జన్మనిచ్చినంతవరకు పౌష్టికాహారాన్ని ఎంతో బాధ్యతాయుతంగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్నా, శిశు మరణాలు సంభవిస్తుండడం విచారకరమన్నారు. ఈ మరణాలకు తల్లిదండ్రుల అవగాహన లోపమా, లేక వైద్య ఆరోగ్య శాఖాధికారులు, అంగన్వాడీల సిబ్బంది నిర్లక్ష్యమా అన్న దానిపై నివేదికలు తెప్పించుకునే క్రమంలో ఉన్నామని చెప్పారు. వీటిలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం బహిర్గతమైతే క్రమ శిక్షణ చర్యలకు రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసులు చేస్తామన్నారు. ఈ సమావేశంలో మండల తహశీల్దార్ తిరుమలరావు, ఎంపీడీఓ లాలం సీతయ్య, సిడిపిఓ వెంకట రమణ, సూపర్‌వైజర్ సునీత, మంప ఎస్ఐ లోకేశ్ కుమార్, ఎంఇఓ బోడం నాయుడు, చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా కన్వీనర్ బాకా లవకుశ, కొయ్యూరు మండల కన్వీనర్ పి.అచ్యుత్, బిలాస్కార్, సాగర్, ప్రసన్న, వెంకాయమ్మ, సోమేష్, ఎస్.సంజీవ్ పాల్గొన్నారు.

సమస్యలపై పారిశుధ్య కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-పాడేరు: గ్రామపంచాయతీ కార్మికుల టెండర్ పద్ధతి రద్దు చేయాలని, బకాయి పడ్డ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ అల్లూరి జిల్లా కలెక్టరేట్ వద్ద సిఐటియు, ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, గ్రామాలను పరిశుభ్రంగా చేస్తూ ప్రజా ఆరోగ్యం, పర్యావరణాన్ని కాపాడుతున్న పారిశుద్య కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని విమర్శించారు. పాడేరు, అరకు వ్యాలీ మేజర్ పంచాయితీల్లో నాలుగు నెలలుగా వేతనాల బకాయిలు ఉన్నాయని తెలిపారు. సచివాలయాల్లో గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు సంవత్సరం నుండి వేతనాలు ఇవ్వలేదని విమర్శించారు. ఇలా అయితే కార్మికులు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. జీవో 551 ప్రకారం కార్మికులకు గుర్తింపు కార్డులు, కనీసం వేతనాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ ఇవ్వాల్సి ఉన్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. పోరాడి సాధించుకున్న జీవోలని కాగితాలకే పరిమితం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ జీనబంధు మాట్లాడుతూ, కార్మికుల్లో అందరూ వెనకబడిన గిరిజనని అందుకే ప్రభుత్వాలు చిన్న చూపు చూపిస్తున్నాయని విమర్శించారు. పంచాయతీ కార్మికులకు తక్షణం ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, కనీస వేతనం 26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనిఫార్మ్, బూట్లు, రైన్ కోట్లు, బ్లౌజులు వంటివి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలపై ఈనెల 28న అన్ని ఎంపిడిఓ కార్యాలయాల ముందు నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు. సమస్యలు పరిష్కారం కాకపోతే చలో విజయవాడ కార్యక్రమానికి సన్నద్ధం కావాలని కోరారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు అర్జున్, వెంకట్, బుద్ధు, వెంకట్రావు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నేత ఉమామహేశ్వరరావు, పారిశుధ్య కార్మికులు

గంజాయి నియంత్రణపై ప్రచారం

ప్రజాశక్తి- పెదబయలు: మండల కేంద్రంలో జరిగే వారపు సంతలో జి.మాడుగుల సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో గంజాయి నియంత్రణపై ప్రచారం చేశారు. గంజాయి వద్దు ప్రత్యామ్నాయ పంటలే ముద్దంటూ సీతగుంట పంచాయతీ వారపు సంతలో విస్తత ప్రచారం చేపట్టారు.



ప్రచారం చేస్తున్న పోలీసులు

ఓటర్ జాబితాలో గల్లంతైన వారి పేర్లు తక్షణమే చేర్చాలి

ప్రజాశక్తి -సీలేరు

ఓటర్ జాబితాలో గల్లంతైన వారి పేర్లను తక్షణమే ఓటర్ లిస్టులో నమోదు చేయాలని సిఐటియు నాయకులు ఎస్‌కె సుభాన్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జీకే వీధి మండలం, సీలేరు మేజర్ పంచాయతీ ఓటరు జాబితాలో సుమారు 200 మంది పేర్లు గల్లంతు కావడంతో వారంతా శనివారం పంచాయతీ సర్పంచ్ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో ఓటు వేయలేని పరిస్థితి దాపురించిందిన తెలిపారు. అధికారుల తప్పిదం వల్ల ఈ పరిస్థితి వచ్చిందని, ఇటువంటి సమస్యలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోనేలా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాబోయే 2024 ఎన్నికలకు ముందే ఓటర్ జాబితాలో తప్పులు తడకలను సరిచేసి అర్హులైన అందరికీ ఓటు హక్కు కల్పించాలని కోరారు.



ఆసుపత్రి ఆరుబయట కూర్చున్న విద్యార్థులు

ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు జ్వరాలు

హెల్త్ వాలంటీర్లు లేక ఇబ్బంది పడుతున్నవైనం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ప్రస్తుతం వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల కనుగుణంగా మండలంలోని ఆశ్రమ పాఠశాలల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. దీంతో, విద్యార్థిని, విద్యార్థులు జలుబు, తలనొప్పి, దగ్గు జ్వరం వంటి లక్షణాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యాధులకు గురైన విద్యార్థులకు వెంటనే వైద్య చికిత్సలు అందించేందుకు పాఠశాలల్లో హెల్త్ వాలంటీర్‌లు లేక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతూ ఉపాధ్యాయుల సహాయంతో దగ్గరలోనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కెళ్ళి వైద్య సేవలు పొందుతున్నారు.

మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో సుమారు 30 మంది విద్యార్థులు జలుబు, తలనొప్పి, జ్వరం వంటి వ్యాధులకు గురయ్యారు. దీంతో, ఆ పాఠశాల మెట్రిన్ విద్యార్థులకు వైద్య సేవలు అందించడానికి సోమవారం ఉదయం స్థానిక డుంబ్రిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి స్థానిక వైద్యాధికారి రాంబాబు వైద్య సేవలు అందించారు. ఈ ఒక్క పాఠశాలలోనే కాకుండా మండల వ్యాప్తంగా ఉన్న బాలుర, బాలికల ఆశ్రమ పాఠశాలల్లో కూడా విద్యార్థులు జలుబు, దగ్గు, తలనొప్పి జ్వరాలు వంటి వ్యాధులతో బాధపడుతున్నారు. గతంలో అశ్రమ పాఠశాలల్లో హెల్త్ వాలంటీర్లను ప్రభుత్వం నియమించింది. వ్యాధులకు గురైన విద్యార్థులకు పాఠశాలల్లోనే వైద్య సేవలను వారు అందించేవారు. ప్రస్తుతం హెల్త్ వాలంటీర్లు లేక ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు సకాలంలో వైద్య సేవలు అందరిని పరిస్థితి నెల కొంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. ఎటువంటి వ్యాధులు సోకిన ఉపాధ్యాయులే హాస్పిటల్ కు తరలించే పరిస్థితి ఉంది. తక్షణమే ప్రభుత్వ స్పందించి గతంలో మాదిరిగా గిరిజన ఆశ్రమ పాఠశాల వసతి గృహల్లో హెల్త్ వాలంటీర్లను నియమించి గిరిజన విద్యార్థులకు సకాలంలో వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: రాజ్ మా విత్తనాలను సకాలంలో రైతులకు ప్రభుత్వం పంపిణీ చేయాలని స్థానిక సిపిఎం మండల నాయకులు, మాజీ సర్పంచ్ పి సురేష్ కుమార్, మాజీ ఉపసర్పంచ్ పి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, సకాలంలో విత్తనాలు పంపిణీ చేయకపోవడంతో ఒరిస్సా, ఇతర ప్రాంతాల్లో అధిక ధరలు వెచ్చించి కోనుగోలు చేసుకుంటున్నారనీ చెప్పారు. సీజన్ దాటిపోతున్నా ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చే సబ్సిడీ విత్తనాలు సకాలంలో అందించకుండా నిర్లక్ష్యం చేయడం సబబు కాదన్నారు. ఈ కారణంగా రైతులు నష్ట పోయే అవకాశం ఉందని చెప్పారు. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని సంతలో దళారులు అధిక ధరలకు విక్రయాలు చేస్తున్నారని చెప్పారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి సకాలంలో విత్తనాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.

మణిపూర్‌లో మహిళలకు రక్షణ కల్పించండి

మండల పాస్టర్స్ కమిటీ, సిపిఎం, ఐద్వా ఆధ్వర్యాన శాంతి ర్యాలీ

ప్రజాశక్తి-విఆర్.పురం

మణిపూర్‌లో మహిళలకు రక్షణ కల్పించాలని కోరుతూ మండల పాస్టర్ల కమిటీ, సిపిఎం, ఐద్వా ఆధ్వర్యాన విఆర్.పురం గ్రామంలోని గొల్లగూడెం వీధి నుండి రేఖపల్లి జంక్షన్ వరకు సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్, మండల పాస్టర్స్ కమిటీ ప్రతినిధి డేవిడ్ లివింగ్ స్టన్, ఐద్వా మండల అధ్యక్షులు, ఎంపీపీ కారం లక్ష్మి, జెడ్పిటిసి వాళ్ల రంగారెడ్డి మాట్లాడుతూ మణిపూర్లో ఇద్దరు గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించిన వాళ్ళని ఉరితీయాలని డిమాండ్ చేశారు. ఎంతో మంది కుక్కీ తెగకు చెందిన మహిళలు భయంగా బతుకుతున్నారన్నారు. కేంద్రంలోనూ మణిపూర్‌లోనూ అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వాలు కుక్కీ, మైతీల సమస్యలు తమకేమీ తెలియనట్టు వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. మణిపూర్ ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేసి, మహిళలందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మణిపూర్ కొండల్లో ఉన్న విలువైన ఖనిజ సంపద కోసం ప్రభుత్వమే ఈ గొడవలు సృష్టిస్తుందని, ఈ గొడవల్లో ఎంతోమంది మహిళలు చిత్రహింసలకు గురవుతున్నారని, మన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు లక్ష్మణరావు, తాతబాబు, కుంజ నాగిరెడ్డి, విఆర్ పురం పాస్టర్లు సువర్ణ రాజు, గాబ్రి యెల్, బోయజు, జోనాస్, కూన వరం పాస్టర్లు మోజెస్, ప్రేమ్‌సాగర్, జెర్మియా, స్టీఫెన్, మండల చర్చి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపిపి కారం లక్ష్మి



అభ్యర్థికి ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ఐటిడిఎ ఎపిఒ, పలు శాఖల అధికారులు

ఖాళీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-రంపచోడవరం

అడ్డతీగల మండలం పింజరకొండ జల విద్యుత్తు కేంద్రంలో ఖాళీగా ఉన్న 10 పోస్టులకు దరఖాస్తు చేసుకున్న గిరిజనులకు కమిటీ ద్వారా సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. స్థానిక ఐటిడిఎ ఎపిఒ జనరల్ ఛాంబర్లో ఎపిఒ సిహెచ్.శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌కో డిప్యూటీ జనరల్ మేనేజర్ అంకిరెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్‌రాజ్, ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎండి యూసఫ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.వెంకటేశ్వరరావు, ఏఈ మురళి తదితరులు ఈ ఇంటర్వ్యూలు నిర్వహించారు. 4 ప్లాంటు ఆపరేటర్ పోస్టులకు, 4 హెల్పర్ పోస్టలకు, 2 వాచ్‌మెన్ పోస్టులకు మొత్తం 217 దరఖాస్తులు రావడం జరిగిందని ఏపీవో తెలిపారు. వీటిలో 34 దరఖాస్తులను కొన్ని కారణాల వలన రిజెక్ట్ చేసి, 183 దరఖాస్తులను పరిగణనలోనికి తీసుకొని గిరిజన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగిందని ఏపీఓ తెలిపారు.

నర్సీపట్నం - సీలేరు మెయిల్ బస్సు పున:ప్రారంభం

ప్రజాశక్తి -సీలేరు

నర్సీపట్నం-సీలేరు మెయిల్ బస్సును సోమవారం నుంచి పున:ప్రారంభించారు. జీకే వీధి మండలం సీలేరుకు నర్సీపట్నం నర్సీపట్నం నుండి ఎస్ఆర్‌సిఎంటి ప్రైవేట్ మెయిల్ బస్సు వయా చింతపల్లి, సీలేరు మీదుగా ఒడిశాలోని చిత్రకొండ వరకు గతంలో తిరిగేది. అంతరాష్ట్ర రహదారి అధ్వానంగా ఉండడంతో చిత్రకొండ వెళ్లకుండా సీలేరు వరకే బస్సు యాజమాన్యం నడిపేది. ఈ బస్సు నర్సీపట్నంలో తెల్లవారుజామున ఐదు గంటలకు బయలుదేరి సీలేరు 11గంటలకు చేరుకొని, మరల 11.30 తిరిగి సీలేరు నుంచి బయలుదేరి నర్సీపట్నం సాయంత్రం ఐదు గంటలకు చేరుకుండేది. ఈ బస్సు సీలేరు, దుప్పిలివాడ, దారకొండ పంచాయతీల ప్రయాణికులకు ఎంతో అనువుగా ఉండేది. అయితే నాలుగు నెలలు క్రితం ఈ బస్సులో అక్రమంగా తరలిస్తున్న గంజాయి, నిందితుడు పట్టుబడడంతో మెయిల్ బస్సు సేవలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురయ్యారు. ప్రయాణికుల విన్నపం మేరకు మెయిల్ బస్ యాజమాన్యం చొరవ తీసుకుని నర్సీపట్నం నుండి సీలేరు వరకు బస్సు నడిచే విధంగా చర్యలు చేపట్టారు. దీంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పున: ప్రారంభమైన మెయిల్ బస్సు ఇదే..

చిట్టెంపాడులో 'పొలం బడి'

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని చిట్టెంపాడులో పొలంబడి కార్యక్రమాన్ని మండల వ్యవసాయశాఖాధికారి ఉమాదేవి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ యూరియా దమ్ములో 10 కేజీలు, నెల రోజుల తర్వాత మరో 25 కేజీలు వాడాలని సూచించారు. ఉడుపు చేసేటప్పుడు ఆకు కొనలను కత్తిరించడం ద్వారా ఆకుముడత తెగులును నివారించవచ్చని తెలిపారు. ఉడుపు చేసిన నెల రోజులకు ఎకరానికి 1 లీటరు వేప నూనె పిచికారీ చేసినట్లయితే పురుగులు నివారించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బిడిజాన అప్పారావు, వైసిపి నాయకులు ఉల్లి రామ్మూర్తి, పొలంబడి రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు రాజేష్ పాల్గొన్నారు.



వరి నాట్లుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి ఉమాదేవి

ఘనంగా బండి జాతర

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని సీతంపేట, రాజుపేట గ్రామంలో బండి కొలుపు జాతర కన్నుల పండుగగా జరిగింది. నాలుగు రోజుల పాటు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించిన బండి కొలువు జాతర ఐదో రోజు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలతో ముగిసింది. గ్రామ గనాచారులు పూనకాలతో, పోతురాజులు ఉగ్రరూపంతో డప్పు దరువులు మేళతాళాలు మధ్య బండి కొలువు సంబరాలు అంబరాన్ని అంటాయి. సీతంపేట రాజపేట గ్రామ పెద్దలు ఆధ్వర్యాన జరిగిన ఈ జాతరలో అశేషంగా భక్తులు పాల్గొన్నారు.



జాతరలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు

అనంతగిరిలో వింత వాతావరణం

ఒకే రోజు ఎండా, వాన, పొగమంచు

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలో సోమవారం వింత వాతావరణం నెలకొంది. ఉదయం నుండి 10 గంటల వరకు ఎండకాయగా, 10.30. నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు కుండపోత వాన ఏకధాటిగా కురిసింది. మధ్యాహ్నం ఒంటి గంట నుండి రెండు గంటల వరకు వర్షం తగుముఖం పట్టి కాస్త ఎండ కాసింది. ఆ తర్వాత మూడు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల సమయంలో పొగ మంచుతో కూడిన వర్షం కురిసింది. గత మూడు రోజుల నుంచి కురుస్తున్న తేలికపాటి వర్షాలు ఒక ఎత్తయితే సోమవారం వింత వాతావరణంతో ఒకే రోజు మూడు కాలాలను తలపించాయి. ఇదిలా ఉండగా సోమవారం మండల కేంద్ర వారపు సంత కావడంతో వర్షానికి చిరు వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

డుంబ్రిగుడలో కుండపోత వర్షం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలో సోమవారం సాయంత్రం భారీ కుండపోత వర్షం కురిసింది. మండల కేంద్రంలోని వీధి కాలువలు వరద నీటితో నిండగా, రోడ్లన్నీ జల మయంగా మారాయి. సుమారు గంటపాటు ఏకధాటిగా కుండపోత వర్షం కురవడంతో వ్యవసాయ పంట పొలాలన్నీ వర్షపు నీటితో కళకళలాడాయి. గత కొద్ది రోజులుగా వర్షం లేకపోవడంతో ఆందోళనకు గురవుతున్న రైతులకు ఈ కుండ పోత వర్షం ఆనందం నింపింది.వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చిన మారుమూల గిరిజనులు తిరుగు ప్రయాణంలో పలు ఇబ్బందులు పడ్డారు.

25న జాబ్ మేళా

ప్రజాశక్తి- పాడేరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో అరకు వ్యాలీ ప్రభుత్వ ఐ.టి.ఐలో ఈనెల 25న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారిజి. ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేళాకు 10 కంపెనీలు హాజరు కానున్నాయన్నారు. 18 సంవత్సరాల నుండి 30 ఏళ్ల మధ్య గల ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీ, బి.టెక్ ఆపై చదువు పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశం వినియోగించుకోవాలని కోరారు. ఇంటర్వ్యూకు బయో డేటా, ఆధార్ కార్డు, సర్టిఫికేట్స్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని తెలిపారు. ఎంపిక కాబడిన అభ్యర్థులకు నెలకు జీతం రూ.10,000 నుండి 30,000 వరకు ఇస్తారన్నారు. ఈ సదవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగ పరుచుకోవాలని కోరారు మరిన్ని వివరాలకు ఫోన్: 9491786463, 6304634447 నెంబర్లను సంప్రదించాలన్నారు.

46, 47 వార్డుల్లో జివిఎంసి కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 46, 47 వార్డుల పరిధిలోని కప్పరాడ స్వీపర్ కాలనీ, కైలాసపురం, కస్తూరినగర్, శాంతినగర్ తదితర ప్రాంతాలలో జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా 46వ వార్డులో ప్రధానంగా 24 X 7 తాగునీరు అందించాలని, శిథిలమైన కాలువలు, రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, కస్తూరినగర్ నుంచి జాతీయ రహదారి వరకు ప్రధాన గెడ్డను ఆధునికీకరించాలని, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్న పోర్టు క్వార్టర్లలో నిఘా ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని, తాటిచెట్లపాలెం నుంచి కైలాసపురం వరకు రోడ్లు ఫుట్ పాత్‌లు, కాలువలు నిర్మించాలని కమిషనర్‌ను డిప్యూటీ మేయర్ కట్టమూర్తి సతీష్ కోరారు. కమిషనర్ స్పందిస్తూ తాటిచెట్లపాలెం నుంచి కైలాసపురం వరకు రోడ్లు, కాలువల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. మిగిలిన పనులు అంచలంచెలుగా చేపడతామని కమిషనర్ తెలిపారు.

47 వార్డులో కప్పరాడ కొండవాలు ప్రాంతం కావడంతో కాలువలు శిథిలావస్థలో ఉన్నాయని, వాటిని నిర్మించాలని, తాగునీటి సమస్య తీర్చాలని, 275 సచివాలయం సిబ్బంది సరిగా విధులకు రావడం లేదని, స్వీపర్ కాలనీలో పారిశుధ్య కార్మికులు రావడంలేదని, వీధిలైట్లు సరిగా వెలగడం లేదని, రోడ్లను ఆక్రమించి ఉన్న బడ్డీలను తొలగించాలని, 36-96-55 గల ఇంటిలోకి కాలువ నీరు వస్తోందని, వెంటనే పరిష్కరించాలని కమిషనర్‌ను కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి కోరారు. కమిషనర్ స్పందిస్తూ రహదారులు, ఫుట్ పాత్‌లపై ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక అధికారి సునీత, ప్రధాన వైద్యాధికారి నరేష్ కుమార్, జోనల్ కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ, పర్యవేక్షక ఇంజినీరు వేణుగోపాల్, కార్యనిర్వాహిక ఇంజినీర్ శ్రీనివాసు, ఎఎంఒహెచ్ డాక్టర్ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోందులకు న్యాయం చేయాలని ధర్నా

ప్రజాశక్తి-రంపచోడవరం

రాజవొమ్మంగి, అడ్డతీగల మండలాల్లోని కోందు తెగకు చెందిన గిరిజనుకుల న్యాయం చేయాలని కోరుతూ రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం వద్ద ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన బాధిత గిరిజనులు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 20 సంవత్సరాల క్రితం వలస వచ్చి రాజవొమ్మంగి మండలం చెరుకుంపాలెం వద్ద అడవిలో నివసిస్తున్న కోందు జాతి గిరిజనులు 12 కుటుంబాలపై ఏడాది క్రితం అటవీ అదికారులు దాడి చేసి వారు నివసిస్తున్న గుడిసెలను తగలబెట్టారని తెలిపారు. వారికి ఐటిడిఎ అధికారులు ఉండటానికి నివాసం, సాగుభూమి, ఉపాధి కల్పించలేదని, వారికి ఆధార్ కార్డులు ఉన్నప్పటికీ రేషన్ కార్డులు మంజూరు చేయలేదని తెలిపారు. అడ్డతీగల మండలం దొర మామిడి పంచాయితీ కినపర్తి అడవిలో నివసిస్తున్న 60 మంది కోందుల పరిస్థితి కూడా అలాగే ఉందన్నారు. గిరిజనులను అడ్డతీగల, రాజవొమ్మంగి మండల తహశీల్దార్లు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. జిల్లా, ఐటిడిఎ అధికారులు దృష్టి పెట్టి కోందు తెగల గిరిజనులకు న్యాయం జరిగేలా చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ వినోద్ మిశ్రా ఆర్గనైజింగ్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి కోసిరెడ్డి గణేశ్వరరావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నాగులపల్లి అర్జునుడు, మాడెం బాబురావు, డిప్పలి చిన్నబ్బాయి, తాంబేలు సన్యాసిరావు, మర్రి రాంబాబు, చిక్కుడు సీతమ్మ, శ్రీధర్ లక్ష్మి, కిలో సత్తిబాబు, గుంట చిన్నారావు, వంతల రాజు, గిన్నిల చిన్న, కన్నోజు సింహాచలం పాల్గొన్నారు.

భారీగా రైళ్లు రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విజయవాడ డివిజన్‌లో ట్రాఫిక్ కమ్ పవర్ బ్లాక్, ప్రీ-నాన్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా 32 రైళ్లను రద్దు చేశామని వాల్తేరు రైల్వే సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ మేరకు 17239 గుంటూరు-విశాఖపట్నం సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 12740 సికింద్రాబాద్-విశాఖపట్నం గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్, 17243 గుంటూరు - రాయగడ ఎక్స్‌ప్రెస్, 17488 విశాఖపట్నం - కడప తిరుమల ఎక్స్‌ప్రెస్, 12718 విజయవాడ -విశాఖపట్నం రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, 12717 విశాఖపట్నం - విజయవాడ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, 12805 విశాఖపట్నం - లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్, 12861 విశాఖపట్నం - మహబూబ్‌నగర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లను ఆగస్టు 22 నుంచి 29 తేదీల్లోనూ, 17240 విశాఖపట్నం - గుంటూరు సింహాద్రి, 12739 విశాఖపట్నం - సికింద్రాబాద్ గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్, 17244 రాయగడ - గుంటూరు ఎక్స్‌ప్రెస్, 17487 కడప - విశాఖపట్నం తిరుమల ఎక్స్‌ప్రెస్, 12806 లింగంపల్లి - విశాఖపట్నం జన్మభూమి ఎక్స్‌ప్రెస్, 12862 మహబూబ్‌నగర్ - విశాఖపట్నం సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆగష్టు 23 నుంచి 30 వరకూ రద్దు చేశారు. అలాగే 20811 విశాఖపట్నం - నాందేడ్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను ఆగస్టు 26, 29 తేదీల్లోనూ, 20812 నాందేడ్ - విశాఖపట్నం సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను ఆగస్టు 27, 30 తేదీల్లోనూ, 20809 సంబల్పూర్ - నాందేడ్ నాగావళి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను ఆగస్టు 25, 27, 28 తేదీల్లోనూ, 20810 నాందేడ్ - సంబల్‌పూర్ నాగావళి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను ఆగస్టు 26, 28, 29 తేదీల్లోనూ, 22701 విశాఖపట్నం-విజయవాడ ఉదయ్ ఎక్స్‌ప్రెస్, 22702 విజయవాడ-విశాఖపట్నం ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌లను ఆగష్టు 25, 26, 28, 29 తేదీల్లోనూ, 22707 విశాఖపట్నం - తిరుపతి డబుల్ డక్కర్ ఎక్స్‌ప్రెస్‌ను ఆగస్టు 26, 28, 31 తేదీల్లోనూ, 22708 తిరుపతి - విశాఖపట్నం డబుల్ డక్కర్ ఎక్స్‌ప్రెస్‌ను ఆగస్టు 25, 27, 30 తేదీల్లోనూ రద్దు చేశారు. ఇంకా హైదరాబాద్ - కటక్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం - ఎంజిఆర్ చెన్నయ్ సెంట్రల్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-విశాఖపట్నం ఎసి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్-తిరుపతి ఎసి స్పెషల్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం - సికింద్రాబాద్ ఎసి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-తిరుపతి స్పెషల్ ఎక్స్‌ప్రెస్ వంటివి రద్దయిన వాటిలో ఉన్నాయి. ప్రజలు ఈ మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని రైల్వే అధికారులు కోరారు.

ఇండస్ ఇండ్ సంస్థపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వాయిదాల పేరిట క్యాబ్ డ్రైవర్లను ఇబ్బందులకు గురి చేస్తున్న ఇండస్ ఇండ్ సంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలని విశాఖ క్యాబ్ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు బి.జగన్ డిమాండ్ చేశారు. సదరు సంస్థ వైఖరిని నిరసిస్తూ రైల్వే న్యూకాలనీలో ఉన్న సంస్థ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ఇచ్చిన మారిటోరియంనకు సంబంధించి వాయిదాలు చివర్లో కట్టే అవకాశముందని, దాన్ని ఉల్లంఘించి ఇప్పుడు డబుల్ వాయిదాలు కట్టాలని చెప్పి సంస్థ వేధించడం తగదని అన్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

ఆక్రమణదారుల భూ కబ్జాలతో.. రెవెన్యూ సిబ్బందిపై సభ్యుల ఆగ్రహం



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సభ్యులు

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు: మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి అరిసెల సీతమ్మ అధ్యక్షతన వాడి వాడీగా సాగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, వైస్ ఎంపీపీ 1పాటు పోయి సత్యనారాయణ, ఎంపిటిసిలు సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ భూములను కాపాడాలని, సంతబయలు, హెూలీ గ్రౌండ్, పరిసరాల ప్రాంతాలలో భూ కబ్జా జరుగుతున్నా రెవెన్యూ సిబ్బంది పట్టించుకోలేదని సభ్యులు మండిపడ్డారు. మండల కేంద్రంలో ప్రభుత్వ భూముల రక్షణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని మండల వైస్ ఎంపీపీ పాటు బోయి సత్యనారాయణ డిమాండ్ చేశారు. లక్ష్మీపురం సర్పంచ్ త్రినాథ్ మాట్లాడుతూ, మండల కేంద్రంలో 23 పంచాయితీలకు ఒక అంబులెన్స్ ఉండడంతో సకాలంలో వైద్య సేవలు అందక గర్భిణీలు, బాలింతలు మృత్యువాత పడుతున్నారని తెలిపారు. ఇటీవల ఉబెంగుల గ్రామానికి గర్భిణీని ఐదు కిలోమీటర్ల దట్టమైన అడవుల్లో డోలీలో తీసుకుని రావడంతో సకాలంలో వైద్యం అందక మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. వివోఏల వేతనాల కోత సరికాదన్నారు.వనబసింగి సర్పంచ్ లక్ష్మణ్ మాట్లాడుతూ, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సకాలంలో విత్తనాలు అందజేయా లన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డిస్పుట్ డిటి మత్స్యరాజు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు చేపట్టాలి

జెడ్‌పిటిసి గంగరాజు



రోడ్డును పరిశీస్తున్న గంగరాజు

ప్రజాశక్తి అనంతగిరి: జిల్లాలో రెండు మండలలైన అనంతగిరి, అరకు మండలాల సరిహద్దు కోనాపురం రోడ్డు మరమ్మతు చేపట్టాలని జెడ్పీటీసీ గంగరాజు డిమాండ్ చేశారు. సోమవారం కోనాపురంలో సందర్శించిన ఆయన రోడ్డు సమస్య పై గ్రామస్తులకు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, గత 15. ఏళ్ల క్రితం నిర్మించిన రోడ్డు మరమ్మతుకు గురి కావ్వడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ, ప్రముఖ ప్రర్యాటక ప్రంతమైన బొర్రా నుండి. కోనాపురం, సప్పాడి మీదుగా కోనాపురం. కితలంగి, కరాయిగుడ మీదుగా. అరకు మండలం లోతేరు మొయిన రోడ్డు వరకు అధ్వానంగా రోడ్డు ఉందన్నారు. కోనాపురం రోడ్డు బొర్ర గేటువలస నుండి లోతేరు రోడ్డు కరాయిగుడ జంక్షన్ వరకు అస్తవ్యస్తంగా ఉందని తెలిపారు. ఈ రోడ్డు 10 కిలోమీటర్ల మేర అనంతగిరి, అరకులోయ మండలాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. నిత్యావసర సరుకులు తెచ్చుకునేందుకు ఇదే ప్రధాన రహదారి అని, తక్షణమే సంబందిత అదికార్లు మరమ్మతు పనులు చేప్పట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి నిధుల మంజూరు కోసం ప్రయత్నం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టోకురు సీపీఎం సర్పంచ్ కిల్లో మోస్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పంచడి కృష్ణ, కిల్లో.రాజు, వార్డు మెంబర్లు జన్ని బాబురావు, కిల్లో కొండప్ప, విజయరావు, అప్పలరాజు, కిల్లో దానియలు, జన్ని జగన్నాథం, పూజారి మంగ్ల పాల్గొన్నారు

మణిపూర్ ఘటనపై శాంతి ర్యాలీ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మణిపూర్ లో ఆదివాసీలపై, క్రైస్తవులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ స్థానిక మండల పాస్టర్ ఫెలోషిప్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని ఇండన్ గ్యాస్ గోడౌన్ నుంచి మూడు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం చేపట్టారు. క్రైస్తవులపై, చర్చిలపై దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకొని మణిపూర్ లో శాంతిని నెలకొల్పాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. . అనంతరం క్రైస్తవ సంఘం నాయకులు మాట్లాడుతూ,భారతదేశం అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని, ఇక్కడ కుల, మత భేదాలు లేకుండా అందరికీ సమానంగా హక్కులున్నాయన్నారు. దాడులను అరికట్టి శాంతిని నెలకొల్పే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. పాస్టర్ ఫెలోషిప్ మండల కన్వీనర్ హెచ్ బీ జాన్ విన్సెంట్, ప్రెసిడెంట్ కృష్ణ దాస్, వ్యవస్థాపకులు జి జాను, గౌరవ అధ్యక్షులు బి.మనసే, కార్యదర్శి సునీల్, ట్రెజరర్ తిమోతి, మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర ఏజెన్సీ మహిళా అధ్యక్షులు కే కృష్ణకుమారి, అల్లూరి జిల్లా అధ్యక్షుడు పి.ధర్మ పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

కరువు ఛాయలు

- సగం కూడా నమోదుకాని సాగు
- కానరాని కంటెంజెన్సీ ప్రణాళిక
- ఉపాధ్యాయుల సర్దుబాటుతో గందరగోళం
- పివిటిజిలకు ఇవ్వని అంత్యోదయ కార్డులు
- రహదారి కోసం అణుకు గిరిజనుల పోరాటం
- నేటి జిల్లా పరిషత్ సమావేశంలో ప్రస్తావనకు అవకాశం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని పాడేరు డివిజన్ 11 మండలాలు మినహా మిగిలిన ప్రాంతంలో ఖరీఫ్ పంటల సాగు అత్యంత ఆందోళనకరంగా వుంది. ఏజెన్సీలో హుకుంపేట, చింతపల్లి, జికె వీధి మండలాల్లో వర్షపాతం లోటువుంది. ఇతర మండలాల్లో వర్షాలు పడ్డంతో సాధారణ విస్తీర్ణంలో దాదాపు సగం వరకు పంటలు నమోదయ్యాయి. అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లో వర్షాలు సకాలంలో పడకపోవడంతో సాధారణ విస్తీర్ణంలో సగం కూడా సాగుకాలేదు. ప్రస్తుత విశాఖ జిల్లాలోని సాధారణ సాగు విస్తీర్ణం 13,937 ఎకరాలకు 910 ఎకరాల్లో పంట నమోదైంది. అనకాపల్లి జిల్లాలో 2,04,982 ఎకరాలకు 18,360 ఎకరాల్లో పంట నమోదైంది. అనేక చోట్ల ఆకు మడులు ఎండిపోతున్నాయి. నాట్లు వేసిన పొలాలు కూడా ఎండలకు బీటలుదేరుతున్నాయి. మరో పది, పదిహేను రోజుల్లో వరి సాగుకు గడువు ముగియనుంది. అయినా సగం విస్తీర్ణంలో కూడా పంట నమోదుకాలేదు. కొన్ని ప్రాంతాల్లో ఉడుపులకు సరిపడా ఆకులేని పరిస్థితి నెలకొంది. ఖరీఫ్ పరిస్థితి నిరాశాజనకంగా వున్నప్పటికీ స్వల్పకాలిక పంటల ప్రణాళిక వ్యవసాయశాఖ తయారుచేయలేదు. రైతులను ఆదుకొనే చర్యలేవీ ప్రభుత్వం చేపట్టలేదు. అనకాపల్లి జిల్లాలో జూన్ ఒకటి నుంచి ఆగస్టు 21 వరకు సగటున 424.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావాల్సివుండగా, 341.5 మిల్లీ మీటర్లు నమోదైంది. నాతవరం మండలంలో - 21.9, రోలుగుంటలో -19.9, కె.కోటపాడులో -32.5, సబ్బవరంలో - 23.6, అనకాపల్లిలో - 39.5, మాకవరపాలెంలో - 32.2, మునగపాకలో - 37.4, అచ్యుతాపురంలో - 30.6, యలమంచిలిలో - 41.2, నక్కపల్లిలో - 43.8, పాయకరావుపేటలో - 36.7, రాంబిల్లిలో - 30.5 వర్షపాతం లోటువుంది. విశాఖపట్నం జిల్లాలో 375.8 మిల్లీమీటర్లకు 368.8 మిల్లీమీటర్లు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 637.4 మిల్లీమీటర్లకు 566.7 మిల్లీమీటర్లు నమోదైంది. పాడేరు డివిజన్‌లోని హుకుంపేటలో - 38. చింతపల్లిలో - 45.3, జికె.వీధిలో - 40.6 వర్షపాతం లోటువుంది.

విద్యా రంగం మరింత దిగజారేలా చర్యలు

ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి ఫలితాలు సంతృప్తికరంగాలేవని మే 23న జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో సభ్యులు ఏకరువు పెట్టారు. ఫలితాలు రాకపోవడానికి కారణాలను గుర్తించి, లోపాలను సరిచేయాలని సూచించారు. ఫలితాలు మెరుగుపడేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యాశాఖ అందుకు భిన్నంగా ఫలితాలు మరింత దిగజారే చర్యలు చేపడుతోంది. జూన్‌లో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు ఆ ప్రాంత పరిస్థితులకు అలవాటుపడకముందే, వారిని వర్క్ అడ్జెస్ట్‌మెంట్ పేరుతో మళ్లీ వేర్వేరు చోట్లకు పంపించే ఏర్పాట్లు ప్రభుత్వం చేస్తోంది. ఆగస్టు 31 వరకు విద్యార్థుల ప్రవేశాలకు గడువు వుండగానే, ఈ ఏడాది జులై 31 నాటి విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకొని ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తోంది. ఉపాధ్యాయుల మిగులు చూపుతోంది. పరవాడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గతేడాది ఆరు నుంచి పది తరగతుల పిల్లలు 405 మంది వున్నప్పుడు ఇద్దరు ఫిజికల్ సైన్సు ఉపాధ్యాయులు పనిచేశారు. ఇప్పుడు ఆ సంఖ్య 430కు పెరిగాక ఇద్దరు ఫిజికల్ సైన్సు టీచర్లలో ఒక టీచర్‌ను విద్యాశాఖాధికారులు మిగులు చూపారు. దీంతో ఆ పాఠశాల పదో తరగతి ఉత్తీర్ణతపై ప్రభావం పడుతుందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వర్క్ అడ్జెస్ట్‌మెంట్ పేరుతో ఉమ్మడి జిల్లాలో 431 ఎస్‌జిటిలను మిగులు తేల్చారు.

పివిటిజిల కష్టాలివీ..

పాడేరు ఏజెన్సీ సహా కోటవురట్ల మండలం గొట్టివాడ పంచాయతీలోని అణుకు పివిటిజిలు అంత్యోదయ కార్డులు మంజూరు చేయాలని ఎంతోకాలంగా పోరాడుతున్నారు. అయినా అర్హత కలిగిన ఆదివాసీలకు అంత్యోదయ కార్డులు మంజూరు చేయలేదు.

రహదారి నిర్మాణం చేపట్టాలని, ఆశా కార్యకర్తను నియమించాలని, జగనన్న ఇళ్లు మంజూరు చేయాలని అణుకు గిరిజనులు జులై ఏడు నుంచి రిలే నిరాహార దీక్షలు చేపడుతున్న విషయం తెలిసిందే. ఇలా జిల్లాలో వెంటాడుతున్న ప్రజా సమస్యలపై మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరగనున్న జిల్లా పరిషత్ సమావేశంలో సభ్యులు గళమెత్తనున్నారు. సభ్యులు ఏకోన్ముఖంగా ఒత్తిడి తీసుకొస్తే తప్ప సమస్యలకు పరిష్కారం లభించని పరిస్థితివుంది.

సమస్యలపై వికలాంగుల ధర్నాలు

వికలాంగుల సమస్యలను పరిష్కరించాలంటూ విశాఖ, అనకాపల్లి జిల్లాల కలెక్టరేట్ల వద్ద సోమవారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) ఆధ్వర్యాన వికలాంగులు ధర్నాలు చేపట్టారు. పింఛన్‌ను రూ.6 వేలుకు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేశారు.

అనకాపల్లి : స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద, జిల్లా కలెక్టరేట్ వద్ద ఎన్‌పిఆర్‌డి ఆధ్వర్యాన నిర్వహించిన ధర్నాల్లో సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.అప్పలనాయుడు, జిల్లా కార్యదర్శి బుగిడి నూకప్పారావు మాట్లాడారు. రాష్ట్రంలో 13 లక్షలకుపైగా వికలాంగులున్నారని, వారంతా ప్రభుత్వాల నిరాదరణకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పింఛన్‌ను రూ.6 వేలుకు పెంచి ఇవ్వాలన్నారు. అనకాపల్లి పట్టణంలో వికలాంగుల సంక్షేమ శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక అధికారిని నియమించాలన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో రాపేటి భాస్కరరావు, కాండ్రేగుల అప్పారావు, పెట్ల సన్యాసిరావు, నాదముని ఫణీంద్రకుమార్, రెహమాన్, బుద్ధ ధనలక్ష్మి, ఆడారి అన్నపూర్ణ, బొండా లక్ష్మి, కృష్ణవేణి, పలు మండలాల నుంచి వికలాంగులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : వికలాంగుల సమస్యలపై విశాఖ కలెక్టరేట్ ఎదుట ఎన్‌పిఆర్‌డి నాయకులు ఆందోళన చేపట్టారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సంఘం జిల్లా అధ్యక్షులు పాల వెంకయ్య మాట్లాడారు. సత్తిబాబు, పాపినాయుడు, మహాలక్ష్మిరెడ్డి, పి.నూకరాజు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మేడ పై నుంచి పడి బాలుడు మృతి

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రమాదవశాత్తు మేడపై నుంచి పడి బాలుడు మృతి చెందిన ఘటన నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పెద్దూరు మసీదు వద్ద నివాసముంటున్న దర్శిక సాయి (9) ఇంటి వద్ద ఆడుకుంటూ మొదటి అంతస్తు నుంచి కింద పడిపోయాడు. తీవ్రగాయాలపాలైన బాలుడిని తల్లిదండ్రులు కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బాలుడు మృతిచెందాడు. బాలుడు జ్ఞానినికేతన్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. ఎస్ఐ గౌరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెటిరో ఉద్యోగి ఆత్మహత్య

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని హెటిరో డ్రగ్స్ కంపెనీలో షిఫ్ట్ ఇన్చార్జిగా పనిచేస్తున్న బట్టా రామ గోవింద సత్య చంద్రశేఖర్ (42) సోమవారం మృతి చెందాడు..నర్సీపట్నంలోని శివపురం కి చెందిన బట్టా రామ గోవింద సత్య చంద్రశేఖర్ హెటిరో డ్రగ్స్ కంపెనీలో ఎన్‌ఆర్‌బ్లాక్‌లో షిఫ్ట్ ఇన్చార్జిగా 14 సంవత్సరాల నుండి పని చేస్తున్నారు.ఆదివారం రాత్రి సి షిఫ్ట్ డ్యూటీకి ఇంటి నుండి కంపెనీ బస్సులో వచ్చాడు. సహచర ఉద్యోగులతో కలిసి రాత్రి పని చేశారు. సోమవారం తెల్లవారుజామున చంద్రశేఖర్ కనిపించక పోవడంతో తోటి ఉద్యోగులు వెతకగా సమీపంలో ఉన్న రేకుల షెడ్‌లో ఉరేసుకున్నట్లు గుర్తించారు. కొన ఊపిరితో ఉండటంతో కంపెనీ అంబులెన్స్ లో నక్కపల్లి సి.హెచ్.సికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతిని భార్య శేష వరలక్ష్మి మాట్లాడుతూ, తన భర్తకు సీరియస్ గా ఉందని ఆసుపత్రికి రావాలంటూ కంపెనీ నుండి ఫోన్ వచ్చిందని వచ్చేసరికి ఆయన మృతి చెందారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. మతుని ఆత్మహత్యకు కారణాలు తెలియలేదని, భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శిరీష తెలిపారు. సంఘటనా స్థలాన్ని సిఐ అప్పన్న, ఎస్ఐ శిరీష పరిశీలించారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని మతుని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కుమార్తెను గర్భవతిని చేసిన తండ్రికి జీవితకాల శిక్ష

ప్రజాశక్తి-లీగల్ విలేకరి : వావి వరుసలు మరచి 15 ఏళ్ల కుమార్తెను గర్భవతి చేసిన తండ్రికి జీవితకాల శిక్ష విధిస్తూ విశాఖపట్నం ఫోక్సో కోర్ట్ న్యాయమూర్తి ఆనంది సోమవారం తీర్పు వెల్లడించారు. బాధిత బాలికకు రూ.10 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ కథనం ప్రకారం... సుమారు 17 ఏళ్ల క్రితం శ్రీకాకుళం జిల్లా లావేరు మండలానికి చెందిన యువతితో మల్కాపురంలోని నిందితుడు ఎర్ర రామచంద్రుడుకు వివాహమైంది. సుమారు పదేళ్ల నుంచి భార్య మానసిక వ్యాధితో మంచాన పట్టింది. ఈ క్రమంలో ఎర్ర రామచంద్రుడు తన 15 ఏళ్ల పెద్ద కుమార్తెపై లైంగిక అఘాయిత్యానికి పాల్పడేవారు. దీంతో బాలిక గర్భవతి అయింది. ఈ విషయాన్ని ఇంటి సమీపంలోని మహిళలు గమనించి శ్రీకాకుళంలో ఉంటున్న బాలిక పిన్నికి సమాచారమందించారు. ఆమె వచ్చి మల్కాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు జరిపి బాలికపై లైంగిక వేధింపులు నిషేధిత చట్టం కింద నిందితునిపై కేసు నమోదుచేసి కోర్టులో ప్రవేశపెట్టారు. విచారణలో నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి పై విధంగా శిక్షిస్తూ తీర్పు వెల్లడించారు.

ఎయుతో పశ్చిమబెంగాల్ సైనిక శాఖ ఎంఒయు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయంతో పశ్చిమబెంగాల్ సైనిక సంక్షేమ శాఖ అవగాహన ఒప్పందం చేసుకుంది. సోమవారం ఎయు వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, పశ్చిమబెంగాల్ రాజ్య సైనిక్ బోర్డు డైరెక్టర్ బ్రిగేడియర్ పార్థో ప్రతిమ్ బారిక్‌లు సంతకాలు చేశారు. అవగాహన ఒప్పందంలో భాగంగా రక్షణ రంగాల ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు, దేశ రక్షణలో దివ్యాంగులైన సైనికులకు బిఎ ఫైన్‌ఆర్ట్స్, పెరఫార్మింగ్ ఆర్ట్స్‌లో సర్టిఫికెట్లు ప్రదానం చేసే విధంగా అవగాహన ఒప్పందం చేసుకున్నారు. రక్షణ రంగాల ఉద్యోగుల భార్యల సంక్షేమ సంఘం నిర్వహించే శిక్షణ కేంద్రాలలో తర్ఫీదు పొందిన, ప్రధాన మంత్రి కౌశల్ యోజనలో శిక్షణ పొందిన వారికి వారి విద్యార్హతలు, నైపుణ్యాలను పరీక్షించి మూడేళ్ల, ఐదేళ్ల డిగ్రీలను ప్రదానం చేస్తారు. ఈ సందర్భంగా బ్రిగేడియర్ పార్థో ప్రతిమ్ బారిక్ మాట్లాడుతూ సైనికోద్యోగులకు ఉన్నత విద్యను అందించే విధంగా ఎయు చేస్తున్న కృషిని అభినందించారు.



వినతులు సమర్పించేందుకు వచ్చిన ప్రజలు

స్పందనకు 51 అర్జీలు

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 51 అర్జీలు అందాయి. వాటిని ఐటిడిఎ ఎపిఒ జనరల్ సిహెచ్.శ్రీనివాసరావు స్వీకరించారు. వై.రామవరం మండలం చింతలపూడి పంచాయతీలోని 13 గ్రామాల గిరిజనులకు సంబంధించిన జాయింట్ భూమి పట్టాలను రీ సర్వే చేసి విడదీసి పట్టాలు మంజూరు చేయాలని ఆ పంచాయతీ ఉపసర్పంచ్ పల్లాల లచ్చిరెడ్డి, ముర్ల జోగిరెడ్డి దరఖాస్తు సమర్పించారు. గంగవరం మండలం ఎటిపల్లి గ్రామంలో తమ భూ సమస్యనున పరిష్కరించాలని ముర్ల బాలమ్మ అర్జీ ఇచ్చారు. దేవిపట్నం మండలం పోలవరం ప్రాజెక్ట్ ముంపునకు గురైన పి.గొందూరు ఆర్ అండ్ ఆర్ కాలనీలకు కరెంటు మీటర్లు ఏర్పాటు చేయాలని పూడిపెల్లి పంచాయతీ సర్పంచ్ కాలుం నరసాయమ్మ, కొమరం వీరమణి, కాలుం శ్రీనివాస్‌దొర విన్నవించారు. అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాలలో కోందు తెగకు సంబంధించిన గిరిజనులకు రేషన్ కార్డులు మంజూరు చేయాలని, భూ సమస్య పరిష్కరించాలని కిలో సత్తిబాబు, కె.గణేశ్వరరావు, నాగులపల్లి అర్జునరావు దరఖాస్తులు సమర్పించారు. రంపచోడవరం మండలం వేములకొండ పంచాయితీలోని ఇళ్లు లేని గిరిజనులకు ఇళ్లమంజూరు చేయాలని, వెట్టిచిలకల గ్రామ పాఠశాలలో విద్యార్థులు ఎక్కువగా ఉన్నారని, మరో ఉపాధ్యాయుడిని నియమించాలని వేములకొండ పంచాయితీ సర్పంచ్ కొమరం పండుదొర, ఎంపీటీసీ నర్రి పాపారావు వినతిపత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జాన్ రాజ్, డిఎస్.శాస్త్రి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి.డేవిడ్ రాజ్, ఎండి యూసఫ్, సుబ్బయ్య, పీహెచ్ఓ కె.చిట్టిబాబు, ఏడిఏ కె.సావిత్రి, పిఎఓ రాంబాబు, ఎడిఎంహెచ్ఓ జి.భాస్కర్, జిసిసి డివిజనల్ మేనేజర్ పార్వతీశ్వరరావు, సీనియర్ మేనేజర్ ముర్ల నాగ వెంకట రాజారెడ్డి, డిఎల్‌డిఓ కె.కోటేశ్వరరావు, సిడిపిఓ సంధ్యారాణి, డాక్టర్ ఓబి ఇందిరా, వెలుగు డిపిఎం అపర్ణ, డివిజనల్ సివిల్ సప్లై అధికారి సి.శ్రీహరి, సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి మడకం సావిత్రి, మలేరియా అధికారి రామకృష్ణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎ.వెంకటేశ్వరరావు, సాయి సతీష్, రాజేంద్ర బాబు, రంగనాథ్, గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయ పరిపాలన అధికారి బి.కిషోర్, లీగల్ సెల్ న్యాయవాది కెవివి సత్యనారాయణ, ఎస్ఓ కబోది, ఎఇ భాను తదితరులు పాల్గొన్నారు.

లోకుల గాంధీ వర్ధంతి

ప్రజాశక్తి-కొయ్యూరు : బిజెపి నాయకుడు లోకుల గాంధీ 2వ వర్ధంతి సందర్భంగా మండలంలోని శరభన్నపాలెంలో ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్ చేతులు మీదుగా ప్రారంభించారు. లోకుల గాంధీ ఈ ప్రాంతానికి చేసిన సేవలను వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పాంగి రాజారావు, పరుశరామ్ రాజు, ఉమా మహేశ్వరరావు, ఎఎంసి చైర్మన్ రాజులమ్మ, ప్రెసిడెంట్ పోరం అధ్యక్షులు రెగటి ముసిలి నాయుడు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అత్యాచార ఘటనపై చర్యలేవీ ?

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పెందుర్తి నియోజకవర్గం పరవాడ మండలంలో ఒక ఆడపిల్లపైన అత్యాచారయత్న ఘటన జరగడం బాధాకరమని, అందులోనూ మహిళల భద్రత కోసం ఏర్పాటు చేసిన మహిళా కమిషన్‌లోని సభ్యురాలి చెల్లెలుపైనే ఈ అఘాయిత్యం జరగడం రాష్ట్రంలో ఆడపిల్లల భద్రత గురించి ఆందోళన కలిగించే విషయమని టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. సోమవారం టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పోలీస్ శాఖ వారు వెంటనే ఈ ఘటనపై స్పందించాలన్నారు.